# ఇంటికిపోదాం

మాకు పెళ్ళి జరిగేక మొదటి పండుగ. అందులోనూ పెద్ద పండుగ సంక్రాంతి. లక్ష్మితోపాటు అత్తారింట పండుగ జరుపుకోవడం కోసం నాల్రోజులు ముందుగానే యీ పల్లెటూరు వచ్చేను. నా భార్య సంబరం అంతా యింతా కాదు. ఇల్లంతా తానే అయి తిరుగుతోంది. నాకు జరిగే సేవల్లో ఎక్కడ లోటుపాట్లు జరుగుతాయో అన్నట్టుగా వూరికే యిదయిపోతోంది. ఆమె చూపే హడావిడి నాకు కొంత చిరాగ్గానే ఉంది అసలు పండుగలూ ఆర్భాటాలూ నాకు నచ్చకపోయినా లక్ష్మి నొచ్చుకుంటుందని తలవంచక తప్పలేదు. మధ్యాహ్నం భోజనాలయ్యేక సినిమా ప్రోగ్రాం పెట్టింది లక్ష్మి.

నాకు నవ్వొచ్చింది. ఈ పల్లెటూర్లో ఉన్నది ఒకే ఒక్క సినిమాహాలు. ఎంత అధ్వాన్నంగా వుండాలో అంతగానూ ఉంది. హైదరాబాద్‌లో సినిమాలే చూడనట్టుగా యిప్పుడీ సినిమా ప్రోగ్రాం ఎందుకో!

"ఎందుకు లెద్దూ, యిప్పుడా డొక్కు థియేటర్లో ఆ బీసీ నాటి సినిమా చూడకపోతే ఏంపోయింది" అన్నాను.

నా మాటలకి లక్ష్మి ముఖం చిన్నబుచ్చుకుంది. ఆమెను మరింత వుడికించాలని "సరే, ఆ థియేటర్లో ఏసీ వుందా?" అనడిగేను.

లక్ష్మికి చప్పున కళ్లంట నీళ్ళు తిరిగేయి. తమ పుట్టింటి వారి వూర్లో ఒక్క ఏసీ థియేటరూ లేకపోవడం ఆమెకి తీరని అవమానంగా తోచినట్టుంది.

"అదికాదండీ, మొదటిసారి మా ఊళ్లో పండక్కి వచ్చి సినిమా చూడకపోతే ఏం బావుంటుంది చెప్పండి?" అంది మాట పెగుల్చుకుని.

"అదేమిటి! బాగుండకపోయేది ఎవరికి?" అన్నాను ఆశ్చర్యంగా.

"అవధానిగారి అల్లుడూ కూతురూ మొదటిసారి పండక్కి వచ్చి ఓ సినిమాలేదు, ఓ ముచ్చటా లేదు అని అందరూ అనుకోరూ?" అంది తడినిండిన కళ్లను తుడుచుకుంటూ.

అదన్నమాట సంగతి. ఉదయాన్నే తలంటుపోయించుకుని వాళ్లిచ్చిన కొత్త బట్టలు కట్టుకుని కొత్త దంపతులిద్దరూ ఆ డొక్కు సినిమా థియేటర్లో సినిమా చూసి వస్తేకాని యీ పండుగ వేడుకలు పూర్తి కావన్నమాట.

"అమ్మాయి ముచ్చటపడుతోంది. కాదనకు నాయనా" అత్తగారి సలహా.

ఇక తప్పేదేముంది? సాయంత్రం మొదటి ఆటకి వెళ్ళడానికి అంగీకారం తెలిపాను.

ఊరికి సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో వుంది సినిమాహాలు. చుట్టుపక్కల గ్రామాల వారందరికీ అందుబాటులో వుంటుందని అక్కడ కట్టేరు. సాయంత్రం అయిదుగంటల నుండీ హాలు బయట స్పీకరులోంచి పాటల సందడి మొదలవుతుంది. ''జయ జయ... జయ జయ శ్రీవేంకటేశా!'' అన్న అరిగిపోయిన రికార్డుతో పాటలు మొదలెడతారు. సాయంత్రం ఏడయినా ఆ పాటలు అలా వేస్తూనే ఉంటారు. షో ప్రారంభించడానికి ఓ టైమంటూ లేదు. గ్రామాలనుంచి జనం వచ్చి హాలు నిండాలంతే.

''మరయితే అంతదూరం నువ్వు నడవగలవా? మీ నాన్నగార్ని సైకిలిమ్మను. ముందు నువ్వు కూచుంటే ఝామ్మని పూలరంగడిలా తీసుకుపోతాను'' అన్నాను నవ్వుతూ.

లక్ష్మికి సిగ్గుతో బుగ్గలు ఎరుపెక్కాయి. ''ఛ. ఊరుకోండి... మా నాన్న రిక్షా పిలిపిస్తాడు. చక్కా అందులో వెళ్ళి వద్దాం'' అంది.

''రిక్షా కన్నా సాయిబు జట్కా బావుంటుందేమో చూడరాదూ?'' అన్నాను నవ్వుతూ.

సినిమాకి వెళ్ళడానికి నేను అంగీకరించడంతో లక్ష్మికి నా మాటలు కోపం తెప్పించలేదు.

''అదేం కాదుగాని, సాయంత్రం అలా కబుర్లు చెప్పుకుంటూ నడుచుకుంటూ వెళ్దాం. చల్లగాలి పీల్చినట్టు వుంటుంది. మీ పల్లెటూరి ప్రకృతి సౌందర్యం వీక్షించినట్టూ వుంటుంది'' అన్నాను. లక్ష్మి సరేనంది.

* * *

కబుర్లు చెప్పుకుంటూ సినిమాహాలు దగ్గరకి మేం వెళ్ళేసరికి ఆరయింది. సినిమా ప్రారంభం కావడానికి యింకా చాలా టైముంది.

''మరీ ముందుగా వచ్చేసామేమో'' అన్నాను.

''ఫరవాలేదు. ఇప్పుడేమయింది'' నవ్వుతూ అంది లక్ష్మి. చిరునవ్వుతో ఆమె ముఖం ప్రసన్నంగా వెలిగిపోతోంది. కొత్త ఆర్గండీ చీరలో అందంతో మెరిసిపోతోంది. విరబోసుకున్న ఆమె కురులు చల్లగాలికి నుదుటిమీద అల్లరిగా ఎగురుతున్నాయి. నవ్వుతూ అటూ యిటూ చూస్తోంది. ఒక్కొక్కరే సినిమాహాలు దగ్గరకి చేరుతున్నారు. అంతా పల్లెటూరి జనమే. పంచెలూ, చొక్కాలయినా వేసుకోకుండా బనియన్లతో వచ్చినవాళ్ళూ, ముతకచీరలూ, మట్టిగాజుల్తో వచ్చిన ఆడవాళ్ళూ వచ్చి చేరుతున్నారు. మూడొంతుల మందికి పైగా కాళ్ళకి చెప్పుల్లేవు. దుమ్ముపట్టిన వట్టి కాళ్ళతో హడావిడిగా వస్తున్నారు. టిక్కట్లకోసం యిక తొమ్ములాట మొదలవుతుంది కాబోలు. కాస్త మంచి బట్టలు వేసుకుని వస్తున్న వాళ్ళూ లేకపోలేదు కానీ, వాళ్ళలో ఎంత ప్రయత్నించినా పట్నవాసపు డాబుసరి మాత్రం రావడం లేదు.

అలాంటి జనం మధ్య మేమిద్దరం ప్రత్యేకంగా కనబడుతున్న మాట వాస్తవం, అది నాకేమీ సంతోషాన్ని కలిగించకపోయినా, లక్ష్మి మాత్రం చాలా సంతోషిస్తున్నట్టు ఆ ముఖమే చెప్తోంది.

అదో రకమయిన సంతృప్తితో, గర్వంతో ఆమె ముఖం వెలిగిపోతోంది. సినిమా చూడాలన్న

సరదా కన్నా ఈ ప్రత్యేకత ప్రదర్శించుకోవాలన్న కుతూహలంతోటే నన్ను బయలుదేరదీసిందేమో కూడా.

చాలామంది లక్ష్మిని గుర్తుపట్టి దగ్గరకొచ్చి పలకరిస్తున్నారు. ఒద్దికయిన ముస్తాబుతో వెలిగిపోతున్న మమ్మల్ని అపురూపంగా చూస్తూ పలకరిస్తున్నారు. చీర కుచ్చెళ్లు సుతారంగా సర్దుకుంటూ, నవ్వుతూ వాళ్లకి జవాబులు చెప్తోంది లక్ష్మి.

''ఇంటికి పోదామా?'' అన్నాను హఠాత్తుగా హాలు వరకూ నడుచుకుంటూ కబుర్లు చెప్తూ వచ్చినపుడు శరీరాన్ని తాకిన చల్లని పైరగాలీ, కనిపించిన పచ్చని ప్రకృతి రమణీయత, అనుభవించిన అందమయిన అనుభూతీ పదిలంగా వుండాలంటే తిరిగి యింటికి వెళ్ళిపోవడమే ఉత్తమం అని నా కెంచేతో అనిపించింది.

''అదేం?'' లక్ష్మి నావేపు ఆశ్చర్యపోతూ చూసింది. నేను జవాబు చెప్పలేదు.

మళ్లీ తనే అంది ''మరేం ఫరవాలేదు. ఈ హాలు వాళ్లు మా నాన్నకి బాగా తెలిసిన వాళ్లే. మనకోసం ప్రత్యేకంగాకుర్చీలు వేస్తారు లెండి'' అంది నా మనోభావమేదో అర్థం చేసుకున్నదానిలాగా.

ఇంతలో మా ముందు ఓ రిక్షా వచ్చి ఆగింది. అందులోనుంచి ఓ జంట దిగింది. మాలాగే కొత్తగా పెళ్లయిన వాళ్లలా ఉన్నారు.

వాళ్లని చూస్తూనే లక్ష్మి మహాసంతోషంతో పలకరించింది. ఆ యిద్దరినీ నాకు పరిచయం చేసింది. అతనికి వైజాగ్‌లో ఉద్యోగం. నాలాగే కొత్త అల్లుడు. అత్తారింటికి వచ్చేడు.

''మీరొచ్చి చాలా సేపయిందా?'' అడిగిందామె.

''అబ్బే అదేంలేదు.. రిక్షా మాట్లాడుకుని వద్దామంటే ఆయనే వద్దన్నారు. అలా చల్లగాలిలో సరదాగా కబుర్లు చెప్పుకుంటూ షికాగులాగా వుంటుందని నడిచే వచ్చేం'' అంది లక్ష్మి. ఆ మాటల్లో రిక్షాలో రావడం వలన వాళ్ళు మేం పొందిన దివ్యానుభూతిని పోగొట్టుకున్నారన్న జాలి నాకు స్ఫురించింది.

''ఇంటికి పోదామా?'' వినీ వినబడనట్లు అడిగాను.

''చాల్చాలు. మళ్ళీ అదేమాటా'' చిరుకోపం ప్రదర్శించింది లక్ష్మి.

అరిగిపోయిన గ్రామ్‌ఫోన్ రికార్డుల మోత, చిరుతిళ్ళు అమ్ముకునే వాళ్లకేకలు, రాను రాను పోగవుతున్న జనం సందడి హెచ్చుగానే వుంది. టిక్కెట్లు యింకా యివ్వలేదు. మరో ఇరవై నిమిషాలు టైముందేమో.

మేం నలుగురం మాట్లాడుకుంటూ వుండేసరికి సరిగా సినిమాహాలు దగ్గరకి వచ్చి ఓ స్కూటరు ఆగింది. ఓ అబ్బాయి, అమ్మాయి. అంతవరకూ అబ్బాయిని పొదివి పట్టుకుని చుట్టూ వేసిన చేయి తీసేసి స్కూటరు దిగిందా అమ్మాయి. ఖరీదయిన చీర, మెడలో తళతళా మెరిసే బంగారు వస్తువులు, చేతులకి నాలుగేసి బంగారు గాజులతో ఆమె అందం ద్విగుణీకృతమవుతోంది. ఆ యువకుడు బాగా చదువుకుని మంచి ఉద్యోగమేదో చేస్తున్నట్లున్నాడు. చాలా స్టయిల్‌గా ఉన్నాడు. వాళ్ళు సరిగా బుకింగు కౌంటరు

వేపు వెళ్ళడం వల్ల మమ్మల్ని గమనించలేదు.

''అరె, మన సుజాతా వాళ్లాయనా కూడా సినిమాకి వచ్చేరే, పలకరిద్దామా'' అనడుగుతో యిందాక రిక్షాలో వచ్చిన అమ్మాయి.

''ఎందుకులెద్దూ'' చప్పున అనేసింది లక్ష్మి. ఆమె గొంతులో ఏదో మార్పు చోటుచేసుకోవ నేను గమనించకపోలేదు. ముఖంలో కొంచెం ప్రసన్నత తగ్గింది. ఇంతవరకూ ఉన్న ఉత్సాహం కొంచె మందగించినట్లయింది.

''మనం బస్సులో కాక యీ వూరికి స్కూటరు మీద రావలిసిందేమో'' లక్ష్మి అప్రస్తుతం గొణిగింది.

''వంద కిలోమీటర్ల దూరం శ్రమ ఎందుకని అనుకున్నాం కదా'' అన్నాను అదోలా చూస్తూ లక్ష్మి మరేం మాట్లాడలేదు.

స్కూటరు మీద దిగిన అమ్మాయి ఓసారి యిటు తిరగడంతో మేం కంటబడ్డాం. నవ్వుతూ వ లక్ష్మిని పలకరించింది. లక్ష్మి ముభావంగా తలపంకించి వూరుకుంది. ఆ వచ్చినమ్మాయి మాటల వల్ల ఆమె చిన్నప్పటి నుంచీ కూడా మంచి స్నేహితులని తెలిసింది. అలాంటిది లక్ష్మి యిప్పుడామెపట్ల అ అప్రసన్నంగా ఉండటానికి కారణం ఏమిటో!

''మొత్తానికి మీ ఊర్లో జనం కొత్తజంటని ఈ డొక్కు థియేటర్లో సినిమా చూసిరాందే వదలర మాట. పండక్కి మీ ఊరొచ్చిన అల్లుళ్లందరూ యిక్కడే కనిపిస్తున్నారు. గ్రామ దేవత మొక్కుబడిలా యీ సినిమా మొక్కుబడియేమిటో ఖర్మ'' అన్నాను నవ్వుతూ, వాతావరణం తేలిక చేయడానికి.

అందరూ నవ్వేరు లక్ష్మి తప్ప. ఆవిడ మూడ్ ఎంచేతో పాడయినట్లుంది. ఈసారి యింటికి పోదా అంటే తప్పకుండా సరే అనేసేలాగుంది. కొంచెం అసౌకర్యంగా కదులుతోంది.

ఇంతలో ఓ తెల్లని అంబాసిడర్ కారు రివ్వున వచ్చి హాలు ముందు ఆగింది. మా అత్తగారి ఊర కారున్నది ఒక్క భూపతిగారికే అని విన్నట్టు గుర్తు. ఆ కారెప్పుడూ పట్నంలో పెద్ద కొడుకు దగ్గ ఉంటుందిట. పండక్కి ఇంటికి అల్లుడొచ్చేడని పట్నం నుంచి కారు కూడా తెప్పించినట్టున్నా భూపతిగారు. అందులోంచి నవదంపతులు దిగేరు. ఖరీదయిన బట్టల్తో, సెంటు గుబాళింపుతో వ చుట్టూ వాతావరణానికి కొత్త సొంపేదో వచ్చి పడినట్టుంది. కార్లోంచి దిగుతున్న ఆమెని చూస్తూనే ల ముఖం ఎంచేతో మళ్ళీ విప్పారింది.

''సుధ.. సుధండీ, చెప్తూంటానుగా, మా భూపతిగారమ్మాయి. మనలాగే కిందటి వేసవిలో పెళ్లయింది. వాళ్లాయన కాబోలు...'' అంది ముఖం యింత చేసుకుని.

ఆవిడ కూడా లక్ష్మిని చూస్తూనే సంతోషం వ్యక్తమయ్యేలా నవ్వుతూ దగ్గరకొచ్చి పలకరించింది.

పరస్పర పరిచయాలయ్యాయి. లక్ష్మి ఆవిడ చేతులు పట్టుకుని ఏవో గలగలా మాట్లాడేస్తోంది ఇందాక లక్ష్మి ముఖంలో కనిపించిన ఉదాసీన భావం మచ్చుకయినా కనిపించకపోవడ ఆశ్చర్యమనిపించింది.

ఇంతలో టిక్కెట్లు యివ్వడం మొదలెట్టారు. హాలుకి సంబంధించిన వాళ్లెవరో సుధనీ, ఆమె భర్తనీ చూసి సాదరంగా లోపలికి ఆహ్వానించేరు. సుధ భర్త టిక్కెట్లకి డబ్బులు తీసి అఫరు చెయ్యబోతే అతను మర్యాదగా తిరస్కరించేడు.

''పదండి, లోపలికి వెళ్ళి కూచుందాం'' అంటూ లక్ష్మి చెయ్యి అందుకుని దారితీస్తూ అంది సుధ, కళ్ళతోనే నన్ను కూడా హాలులోకి ఆహ్వానిస్తూ అది చూసి ఆ హాలుకి చెందిన వ్యక్తి మమ్మల్నిద్దర్నీ కూడా వినయంగా ఆహ్వానించేడు.

''అబ్బే, మేం సినిమాకి రేపొస్తాం లే సుధా, యివాళ ఊరికే అలా షికారుకొచ్చేం అంతే'' ఆమె చేతిని విడిపించుకుంటూ నవ్వుతూనే అనేసింది లక్ష్మి.

నా ఆశ్చర్యానికి అంతులేదు. లక్ష్మి వేపు సాలోచనగా చూసేను. ఆ వదనంలో ఏ భావమూ వ్యక్తం కావటం లేదు. మామూలుగానే ఉంది. ''సరే అయితే'' అని మాకు టాటా చెప్పి వాళ్లిద్దరూ హాలులోకి వెళ్ళిపోయారు.

ఇవాళ లక్ష్మి ప్రవర్తన నాకు కొంత పజిలింగ్‌గా ఉంది.

సరదాగా పట్టుబట్టి మరీ సినిమాకి బయలుదేరదీసింది. తీరా యిక్కడికొచ్చేక-

ఇక్కడ ముగ్గురు స్నేహితురాళ్ళు కలిసేరు. నిజానికి వాళ్లెవరితోనూ ఆ క్షణం వరకూ ఆమెకు విరోధం లేదు. నిజానికి నిన్న కూడా ఆ గ్రామానికి చెందిన ఆ ముగ్గురి గురించీ, తమ స్నేహం గురించీ ఎంతో గొప్పగా చెప్పింది కూడా!

తీరా రిక్షా మీద వచ్చిన స్నేహితురాలినీ, కార్లోంచి దిగిన సుధనీ ఎంతో ఆదరంగా పలకరించింది. కాని, స్కూటరు మీద భర్తతో పాటు వచ్చిన స్నేహితురాలి పట్ల ఆమె ఉదాసీన వైఖరికి అర్థం ఏమై ఉంటుంది?

ఆలోచిస్తే యిందులో ఏదో ఆర్థికసూత్రం యిమిడి ఉంటుందనిపించింది. అది సగటు మహిళ మనసు ప్రతిబింబించేదిగా ఉంటుంది.

లక్ష్మి సగటు మహిళలా ప్రవర్తించడం నాకేమీ కోపం కలిగించలేదు. ఆమె ఉన్న యీ స్థితిలో అది సహజం కూడా.

నా లక్ష్మికి యింకా ఎన్నో చెప్పాలి. ఎంతో చదివించాలి. ఎంతో నేర్పాలి. ఆమె తన వ్యక్తిత్వాన్ని అందంగా మలచుకొనేందుకు దోహదపడాలి.

ప్రస్తుతానికి నేను చేయలిగేది ఏమీలేదు.

అందుకే ''యింటికిపోదాం'' అన్నాను.

''సరే'' ముక్తసరిగా బదులు పలికింది లక్ష్మి.

(ఈనాడు ఆదివారం. 28.3.1993)